క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి యూనియన్ బ్యాంక్ వితరణ



వృద్ధులకు అందించే నిత్యావసర సరకులతో బ్యాంక్ అధికారులు

ఆరిలోవ: యూనియన్ బ్యాంక్ పవర్ హెచ్ఐఎం కమిటీ వృద్ధులకు సహాయం అందించింది. ప్రేరణ హెచ్ఆర్ ప్రవర్తన ప్రక్రియలో భాగంగా గురువారం డెయిరీ ఫారం దరి ఆదర్శనగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలో నిత్యావసర సరకులను యూనియన్ బ్యాంక్ అధికారులు విరాళంగా ఇచ్చారు. వృద్ధులను పలకరించి వారికి నూతన వస్త్రాలు, కిరాణా సామాన్లు, బియ్యం, కుక్కర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు హృషికేష్ మిశ్రా, సంతోష్ ప్రభు, ఏజీఎం సుధాకర్, యూనియన్ బ్యాంక్ పవర్ హెచ్ఐఎం ప్రతినిధి డీవీపీఎస్ రాజు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో వీసీ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లను ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల కోల్‌కతాలోని జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని వచ్చిన విద్యార్థులను ఆమె తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా, సేవా శిక్ష

ఆనందపురం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి భీమిలి న్యాయస్థానం జరిమానా, సామాజిక సేవ శిక్ష విధించారని ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 65 మందిని భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు గురువారం హాజరు పరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి జి.విజయలక్ష్మి ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున జరిమానాతోపాటు సామాజిక సేవ కింద పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు వారు ఏఎంజీ పాఠశాలలో, ఇండోర్ స్టేడియంలో చెత్త తొలగించారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: సహస్రాది తులసీదళాల నడుమ సిరులతల్లి కనకమహాలక్ష్మి నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించాలని ఈవో శిరీష తెలిపారు.

కష్టాలు తీర్చిన వంతెన

నాడు చిన్నపాటి వర్షం పడితే చాలు ఆ ఊరిని వరద నీరు ముంచెత్తేది. వీధుల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయేది. ఇళ్లల్లో సామాన్లు నీట్లో తేలుతుండేవి. దీంతో గ్రామస్తులు తుపాను, భారీ వర్షాలు కురిసే సమయంలో బితుకుబితుకుమంటూ గడిపేవారు. ఇది జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ముంపు సమస్య.

నేడు ఇప్పుడు ఆ గ్రామస్తులకు ముంపు ముప్పు తప్పింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత కృషితో జీవీఎంసీ అధికారులు ఇక్కడ సమస్యకు అడ్డుకట్ట వేశారు. గ్రామం మధ్యలో ఉన్న గెడ్డపై ఎత్తయిన వంతెన నిర్మించారు. ఆ బ్రిడ్జి కింద నుంచి వరద నీరు గెడ్డ ద్వారా కిందకు పోయేటట్లు మార్గం చూపారు. దీంతో గ్రామస్తులు ముంపు సమస్య తీరిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- దశాబ్దాలుగా ముంపునకు గురైన రామకృష్ణాపురం
- రూ.9 కోట్లతో గెడ్డ పనులు నిర్వహించిన ప్రభుత్వం
- మరో రూ.38 లక్షలతో వంతెన నిర్మించిన జీవీఎంసీ
- వర్షపు నీరు బ్రిడ్జి కింద నుంచి గెడ్డ ద్వారా నేరుగా ముడసర్లోవకు



గ్రామంలో చేరిన వరద నీరు (ఫైల్)





రామకృష్ణాపురంలో నిర్మించిన బ్రిడ్జి



గతంలో ఉండే సిమెంట్ కుండీలతో ఉన్న కల్వర్టు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకొని విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రామకృష్ణాపురం గ్రామం ఉంది. ఇక్కడ అన్నీ రేకుల షెడ్డులే ఉన్నాయి. ఈ గ్రామాన్ని ఆనుకుని లోతైన క్వారీ చెరువు ఉంది. వర్షం పడినప్పుడు దీనికి సమీపంలో ఉన్న కంబాల కొండల వెనక భాగం నుంచి వచ్చిన వరద నీరు ఈ చెరువులోకి చేరి, దీని నుంచి గ్రామం మధ్యలో ఉన్న గెడ్డ ద్వారా ముడసర్లోవ రిజర్వాయరులోకి చేరుతుంది. ఈ గెడ్డ సన్నగా ఉండడంతో కిందకు నీరు ధారాళంగా ప్రవహించడానికి వీలుపడేదికాదు. దీంతో చెరువు నీరు గ్రామంలోకి పోటెత్తేది. ఆ నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందిపడేవారు. కొన్నేళ్లుగా ఈ సమస్య. ఈ ఏడాది వర్షాకాలం వరకు ఇదే పరిస్థితిని గ్రామస్తులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను పరిశీలించిన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కార్పొరేటర్ కెల్ల సునీత జీవీఎంసీ ఉన్నతాధికారులతో సంప్రదించి గెడ్డ అభివృద్ధితో పాటు బ్రిడ్జి నిర్మాణం కోసం చర్యలు చేపట్టారు. రూ.9 కోట్లతో సుమారు కిలోమీటరు పొడవున గెడ్డలో అడుగున కాంక్రీట్, ఇరువైపులా ఎత్తయిన కాంక్రీట్ గోడలు నిర్మించారు. అలాగే అంత వరకు ఉన్న కల్వర్టును తొలగించి రూ.38 లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణం ఇటీవల పూర్తియింది. దీనికి ఇరుపక్కలా రోడ్డు నిర్మించాల్సిన పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇక్కడ కల్వర్టును తొలగించి సుమారు మీటరు ఎత్తులో బ్రిడ్జి నిర్మించారు. దాని కింద నుంచి క్వారీ చెరువు నుంచి వచ్చిన వరద నీరు గ్రామం మధ్యలో ఉన్న గెడ్డ ద్వారా నేరుగా ముడసర్లోవ రిజర్వాయరులోకి చేరుతోంది. దీంతో గ్రామంలో నీరు పోటెత్తే సమస్యకు పరిష్కారం లభించింది.

వర్షం కురిస్తే తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం..



వర్షం పడితే మా గ్రామంలో కంబాల కొండల నుంచి వచ్చిన వరద నీరు క్వారీ చెరువులో చేరేది. ఆ నీరు కిందకు వెళ్లే మార్గం సరిగా లేకపోవడంతో ఊరులోకి పోటెత్తేది. ఇళ్లలో నీరు చేరిపోయేది. ఇప్పుడు బ్రిడ్జి నిర్మించడంతో ఆ సమస్య తీరింది. చాలా సంతోషంగా ఉంది.

–కాకర గోవిందు, స్థానికుడు, రామకృష్ణాపురం

తుపాను పేరు వింటే హడలిపోయేవాళ్లం



తుపాను వస్తుందని ముందుగా పేపర్లు, టీవీలలో చూసి గ్రామస్తులం హడలిపోయేవాళ్లం. ఇళ్లలోకి నీరు చేరిపోతుందని భావించి పిల్లలతో భయంతో గడిపేవాళ్లం. తుపాను సమయంలో రాత్రి వేళ నిద్రిపోయేవాళ్లం కాదు. రెండు రోజుల కిందట సంభవించిన మిచాంగ్ తుపానుకు గతాన్ని తలచుకొని భయపడ్డాం. కానీ బ్రిడ్జి నిర్మించడంతో వరద నీరు గ్రామంలోకి చేరకుండా గెడ్డ ద్వారా కిందనున్న ముడసర్లోవ రిజర్వాయరులోకి చేరింది. దీంతో భవిష్యత్‌లో కూడా వరద ఇబ్బంది ఉండబోదని ఊపిరి పీల్చుకున్నాం.

– మరువాడ చిన్నారావు, స్థానికుడు, రామకృష్ణాపురం

వరద సమస్య తీరింది



రామకృష్ణాపురంలో ఎన్నో ఏళ్లుగా ఉండే వరద సమస్య ఇప్పుడు తీరింది. అధికారులు ఇక్కడ చెరువు అంచున గతంలో నిర్మించిన కల్వర్టును తొలగించి ఇటీవల బ్రిడ్జి నిర్మించారు. మిచాంగ్ తుపానుకు కూడా మా గ్రామంలో నీరు పోటెత్తలేదు. గతంలో చిన్నపాటి వర్షానికి కూడా నీరు చేరిపోయేది. ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేసిన మేయర్, కార్పొరేటర్‌కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– వంకర బాబూరావు, గ్రామం సంఘం అధ్యక్షుడు, రామకృష్ణాపురం

సీఎం వైఎస్ జగన్‌తో అవినీతి రహిత పాలన



11వ వార్డులో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



28వ వార్డులో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 11వ వార్డులో గురువారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, మేయర్ వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి 18వ నంబరు సచివాలయం బాలాజీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జెండా, సంక్షేమ పథకాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అధికారులు సచివాలయాలు ద్వారా నేరుగా అందిస్తున్నారన్నారు. దీంతో ఎలాంటి అవినీతి లేకుండా ప్రజలు పథకాలతో లబ్ధి పొందుతున్నారన్నారు. గతంలో పనుల కోసం కార్యాలయాలు చుట్టూ రోజుల తరబడి ప్రజలు తిరిగేవారన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా ప్రజలకు అందుబాటులో వలంటీర్లు, సచివాలయాలు ఉన్నాయన్నారు. వాటి ద్వారా అన్ని పనులు జరుగుతున్నాయన్నారు. అందుకే ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, నగరాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్.కె మోహనరావు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో విశాఖ ఎంతో అభివృద్ధి

బీచ్ రోడ్డు: గడిచిన నాలుగున్నరేళ్లుగా విశాఖ ఎంతో అభివృద్ధి చెందిందని రూ.కోట్లతో రోడ్ల నిర్మాణాలు, గెడ్డల ఆధునికీకరణ పనులు, వైద్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి జరిగిందని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం జీవీఎంసీ 28వ వార్డులో న్యూ పీతానిదిబ్బ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో సామాజిక భవనాలు, సోలార్ విద్యుత్తు దీపాలు, సీసీ రోడ్లను నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలు బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిషరీస్ కమిషనర్ దృష్టికి మత్స్యకారుల సమస్యలు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పేర్ల

ఎంవీపీ కాలనీ: విశాఖలోని మత్స్యకారుల సమస్యలను రాష్ట్ర ఫిషరీష్ కమిషనర్ దృష్టికి మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పేర్ల విజయచందర్ తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో కమిషనర్‌ని కలిసి పలు సమస్యలపై చర్చించినట్లు పేర్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారులకు బీమా సౌకర్యం, డీజిల్ రాయితీ, వేటకు అవసరమైన సామగ్రిపై సబ్సిడీ వంటి అంశాలపై వివరించినట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, ఎంవీపీ కాలనీ మూలపాలెం సొసైటీ అధ్యక్షుడు మారుపల్లి పరదేశి, జాలరి ఎండాడ సొసైటీ అధ్యక్షుడు తెడ్డు గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



యంత్రాలతో వ్యర్థాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది



మట్టి, ఇసుకను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఏయూ క్యాంపస్: వరుస వర్షాల నేపథ్యంలో వార్డుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్యం సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. రోడ్డుపై మేటలు వేసిన ఇసుక, మట్టిని తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానిక 20వ వార్డు పరిధిలో లాసన్స్‌బే కాలనీ, ఈస్ట్‌పాయింట్ కాలనీ, పెదవాల్తేరు తదితర ప్రాంతాలలో వ్యర్థాలను జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది తొలగించారు. డస్ట్‌బిన్‌ల చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పేరుకుపోయిన మట్టి, ఇసుక మేటలను యంత్రాలతో తొలగించారు. పారిశుధ్య పనులను వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, సచివాలయం సిబ్బంది పర్యవేక్షించారు.

10న దయాళ్‌బాగ్ వస్తు ప్రదర్శన

ఆరిలోవ: దయాళ్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 10న జరగనుందని దయాళ్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దయాల్‌బాగ్ వర్సిటీ ఆధ్వర్యంలో విశాలాక్షినగర్ ప్రాంతం దయాళ్‌నగర్‌లో నిర్వహిస్తున్న దయాళ్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు వస్తు ప్రదర్శన ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాధాస్వామి సత్సంగులు తయారు చేసిన చేనేత దుప్పట్లు, తువ్వాళ్లు, షర్టింగ్ క్లాత్‌లు, డ్రెస్ మెటీరియల్, బనియన్లు, బూట్లు, లెదర్ చెప్పులు, ట్రావెల్ బ్యాగులు, సబ్బులు, డిటర్జెంట్ పౌడర్లు, అగర్‌బత్తులు, ఆయుర్వేద మందులు, దోమ తెరలు ప్రదర్శనలో తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఎంవీపీ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం సందర్శించారు. లా అండ్ ఆర్డర్‌తో పాటు క్రైమ్ స్టేషన్లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేయడంతో పాటు సిబ్బంది పనితీరు, ఫిర్యాదుల పరిష్కారంపై ఆరా తీశారు. స్టేషన్ పరిధితో పాటు క్రైమ్ రేట్ ఎక్కువగా ఉండే ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలతో పాటు పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల విషయంలో పూర్తి స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బాలికలపై అఘాయిత్యాల కేసుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్న ఆయన మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకుల రక్షణలో భాగంగా ఎంవీపీ కాలనీ పరిధిలోని అప్పుఘర్ అవుట్ పోస్ట్ నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో డీసీపీ–2 ఆనందరెడ్డి, సీఐ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

సింహాచలం: పాత గోశాల నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో గురువారం పెనుప్రమాదం తప్పింది. పాత గోశాల నుంచి వేపగుంట వైపు వెళ్తున్న కారు అతి వేగంతో వచ్చి రోడ్డుకి ఎడమవైపు ఉన్న విజయ్ హెలీనా ఆస్పత్రి వద్ద పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. అలాగే అక్కడే ద్విచక్ర వాహనం పార్క్‌చేసి కూర్చున్న తల్లి, కుమారుడిని ఢీకొట్టింది. దీంతో తల్లి భవానీకి గాయాలయ్యాయి. ప్రమాదంలో ఒక బైకు బాగా దెబ్బతింది. గాయాల పాలైన భవానీని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

శాడిస్ట్ భర్తకు నాలుగు నెలల జైలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కార్మికవాడకు చెందిన కాపు మోహన్‌రావు అనే వ్యక్తికి భీమిలి 15వ అదనపు మేజిస్ట్రేట్ నాలుగు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్టు భీమిలి సీఐ డి.రమేష్ గురువారం తెలిపారు. 2019లో మోహన్‌రావు తనను శారీరంగా, మానసికంగా హింసించినట్టు భార్య పావని భీమిలి పోలీసుకు ఫిర్యాదు చేసింది. పెంకుతో తలపై కొట్టడంతో అప్పట్లో ఆమె తీవ్రంగా గాయపడింది. హెచ్‌సీ కాంతారావు దర్యాప్తు చేసి వివరాలు న్యాయమూర్తి ముందు వుంచడంతో ఆమె పైవిధంగా తీర్పు చెప్పారు. పావనికి భర్త మోహన్‌రావు రూ.2వేలు నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.